ప్రజాశక్తి
బుధవారం 14 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం

మెరుగైన ఇంటర్ ఫలితాలు

ఫస్టియర్ 66.57 శాతం, సెకెండ్ ఇంటర్‌లో 80.76 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఉమ్మడి జిల్లాలో మొదటి ఇంటర్ 17,238 మంది పరీక్ష రాయగా 11,475 మంది ఉతీర్ణులై 66 .57 శాతం ఫలితాలు నమోదు చేసి రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచారు. ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో 47శాతం ఉతీర్ణతతో ఇదే స్థానంలో ఉండగా, ఈ సారి శాతం పెరిగినా రాష్ట్రంలో అదేస్థానంలో ఉంది. ద్వితీయ ఇంటర్ పరీక్షకు 16,655 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 13,451 మంది ఉత్తీర్ణులై 80.76 శాతం ఫలితాలు నమోదు చేసి రాష్ట్రంలో 8వ స్థానంలో జిల్లాను నిలిపారు. ఇటీవల వెల్లడైన ఫలితాల్లో 57శాతంతో రాష్ట్రంలోనే ఆఖరు స్థానంలో ఉన్న జిల్లా ఈసారి కాస్తా మెరుగైన ఫలితాలు సాధించింది.

సమస్యల నడుమ సర్కారు బడులు

స్థానికంగా పాఠశాల లేకపోవడంతో బయట ప్రాంతాలకు విద్యార్థులు

సాలూరు మండల గంగన్నదొరవలసలో నిర్మాణం మధ్యలో నిలిచిన పాఠశాల

ఈనెల 12 నుంచి పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అంపూర్తిగా ఉన్న నిర్మాణాలు, కనీస మౌలిక సదుపాయాల్లేని తరగతి గదులు దర్శనమిస్తున్నాయి. నాడు-నేడు నిధులతో పాఠశాలల రూపురేఖలు మార్చేశామని పాలకులు, అధికారులు చెబుతున్నా సమస్యలు మాత్రం ఎక్కడిక్కడే ఉన్నాయి. మండలంలోని పలు పాఠశాలల్లోని సమస్యలే ఇందుకు నిదర్శనం.

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని 170 పాఠశాలల ఉన్నాయి. ఇందులో మండల పరిషత్ 56, ప్రభుత్వ ప్రాథమిక 32, ఆశ్రమ పాఠశాలలు 13, ఎయిడెడ్ 4, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు 65ఉన్నాయి. 36 పాఠశాలల్లో నాడు నాడు పనులు జరుగుతున్నాయి. తాడికొండ, దుడ్డుఖల్లు, కొత్తగూడ, కోసింగిభద్ర ఆశ్రమ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. అడవి, కొండలు సమీపాన పాఠశాలల నిర్వహణ ఉండడంతో రాత్రి వేళల్లో ఏదైనా అడవి జంతువు, విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు భయపడుతున్నారు. కోసింగిభద్ర ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్ నిరూపయోగంగా ఉంది. దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వాటర్ ట్యాప్‌లు సక్రమంగా పనిచేయడం లేదు. మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రన్నింగ్ వాటర్ అందుబాటులో లేకపోవడంతో మరుగుదొడ్లు వినియోగం లేకుండా పోయాయి. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయకపోవడంతో వార్డెన్లే తమ సొంతఖర్చులతో నియమించుకొని నెలవారి కొంత మొత్తం చెల్లిస్తున్నారు.

పదేళ్లుగా బయట ప్రాంతానికి బడికి వెళ్తున్న విద్యార్థులు

మండలంలోని దుమ్మంగి, బొద్దిడి గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డంతో గత పదేళ్ల నుంచి పై గ్రామాల్లో విద్యార్థులు చదువుకోడానికి ప్రతిరోజు బయట ప్రాంతాలకు వెళ్తున్నారు. దుమ్మంగి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. మరోవైపు బొద్దిడిలో విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దఖర్జలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి చదువులు సాగిస్తున్నారు. దుమ్మంగిలో గల పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని సంబంధిత అధికారులు తెలిపినా నేటి వరకు నియమించలేదని సర్పంచి పాలక క్రాంతి కుమార్ తెలిపారు. గత ఏడాది కూడా స్థానికంగా పాఠశాల నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీగా ఉన్నచోట ఉపాధ్యాయులను నియమించి స్థానికంగా పాఠశాలలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామంలో పాఠశాలల లేక కొత్తగూడకు వెళ్తున్న దుమ్మంగి గ్రామ చిన్నారులు

అసంపూర్తి గానే నాడు- నేడు పనులు....

సాలూరు రూరల్ : మండలంలో చాలా పాఠశాలల్లో రెండో విడత మంజూరైన నాడు-నేడు పనులు నత్త నడకన సాగుతున్నాయి. మండలంలో 86 పాఠశాలల్లో మొదటి విడతగా 41 పాఠశాలల్లో నాడు నేడు పనులు జరిగాయి. అందులో అన్ని పాఠశాలల నిర్మాణ పనులు పూర్తిగా జరిగాయి. రెండో దశ మంజూరైన నాడు-నేడు పనులు మాత్రం స్థానిక విద్యాకమిటీ అలసత్వం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. పాఠశాలలు పున: ప్రారంభమైనా నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి, అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మండలంలో మరిపల్లి పంచాయతీ గంగన్నదొరవలసలో పాఠశాలకు చుట్టూ పక్కల గల నాలుగు గ్రామాలకు చెందిన 58మంది పిల్లలు రెండు, మూడు కిలోమీటర్ల దూరం నడుచుకొంటూ వస్తున్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతూ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు కనీస సౌకర్యాల్లేక అనేక అవస్థలుపడుతున్నారు. ఈ పాఠశాల నిర్మాణం మొదలై 8నెలలు గడుస్తున్నా నేటికీ పునాదులు వరకే పరిమితమైంది. దీంతో విద్యార్థులను ఎక్కడ కూర్చోబెట్టుకొని చదువు చెప్పాలో ఉపాధ్యాయులకు అర్థం కావడంలేదు. దీంతో పాఠశాల పక్కనే రెండు ఇళ్ల గడపల్లో చదువులు చెప్పిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా భవనం తక్షణమే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తహశీల్దార్లను ఆదేశించారు. మంగళవారం మండల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. న వీం క్షా సమావేశంలో జిల్లా కలెక్టరు అభివృద్ధి పథకాలను సమీక్షిస్తూ మొదటి విడతలో రీసర్వే పూర్తయిన 95 గ్రామాలు, రెండవ విడతలో ఆర్ఒఆర్ పూర్తయిన 62 గ్రామాల్లో జూన్ 25 తర్వాత రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. గృహనిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పట్టణ గృహ నిర్మాణాలతో పాటు, గ్రామీణ గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టరు తెలిపారు. ఇంకా నిర్మాణాలు మొదలు పెట్టని గృహాల పనులను వెంటనే మొదలు పెట్టించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, పనులను పర్యవేక్షించాలని తెలిపారు. లే అవుట్లలో అధికారులు కోరిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని, కావున గృహ నిర్మాణ పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు కూలీలకు ఉపాధి చూపించాలని, గ్రామాల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకొని పనులు చూపించాలని తెలిపారు. అమృత్ సరోవర్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఉద్యానవన తోటల పెంపకానికి ఇచ్చిన లక్ష్యం మేరకు వర్క్ ఆర్డర్లు మంజూరు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని, రూ.24 కోట్లు పెండింగు బిల్లుల చెల్లింపులు చేయడం జరిగిందని, పెండింగు బిల్లులుంటే వెంటనే అప్లోడ్ చేయాలని అన్నారు. విలేజ్ హెల్త్ సెంటరుకు రూ.3లక్షల 50వేలు అదనపు మొత్తాన్ని వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలకు సరైన పరిష్కారం చూపించి సంతృప్తికర స్థాయిని పెంచాలన్నారు. ఆరోగ్యశాఖ నిర్వహించే ఎన్‌సిడి సర్వే జిల్లాలో 81 శాతం పూర్తయిందని, శతశాతం పూర్తి చేసేందుకు ఆరోగ్యశాఖ ద్వారా పెండింగు లిస్టు తీసుకొని మండల అభివృద్ధి అధికారులు, వెలుగు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ కుమార్ ఇతర అదికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, హెచ్ డబ్ల్యుఒలు, జిపిఎస్ పాఠశాలలల హెచ్ ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని తరగతి గదులు శుభ్రంగా ఉండాలని అన్నారు. కిచెన్, స్టోర్ రూమ్ శుభ్రంగా ఉండాలని సూచించారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ ఉండాలని అన్నారు. స్టోర్ రూమ్ లో పాడైపోయిన సరుకులను ఉపయోగించకూడదని సూచించారు. విద్యార్థులు పాఠశాలలకు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో అలసత్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎటిడబ్ల్యుఒలు మంగ వేణి, శ్రీనివాసరావు, అన్ని పాఠశాలల హెచ్ ఎంలు, ప్రిన్సిపాళ్లు, హెచ్ డబ్ల్యుఒలు, పిఎంఆర్‌సి సిబ్బంది, పాల్గొన్నారు.

పడకేసిన కొదమ రోడ్డు నిర్మాణం

- శంకుస్థాపన చేసి ఆరునెలలైనా కదలని పనులు
- కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో గిరిజనులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని గిరిశిఖర గ్రామమైన కొదమకు రోడ్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆర్భాటంగా కొదమ రోడ్డు నిర్మాణానికి ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. ఇంతవరకూ రోడ్డు నిర్మాణ పనులు అంగుళమైనా ముందుకు కదల్లేదు. సుమారు రూ.12కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం చాలా ఏళ్లుగా గిరిశిఖర గ్రామాల గిరిజనులను ఊరిస్తూ వచ్చింది. అటవీశాఖ అనుమతి మంజూరు కావడం ఆలస్యం కావడంతో నిర్మాణానికి తీవ్ర జాప్యమైంది. ఎట్టకేలకు రాజన్నదొర ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించారు. అయితే శంకుస్థాపన చేసి ఆరునెలలు దాటినా పదిశాతం పనులు కూడా జరగలేదని గిరిజనులు వాపోతున్నారు. తుప్పలు, డొంకలు తొలగింపు పనులు చేసి వదిలేశారు. పంచాయితీ రాజ్ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ పర్యవేక్షణలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం నత్తనడకన జరుగుతుండడంతో గిరిజనులు డోలీ మోతలకే పరిమితమవుతున్నారు. కొదమ పంచాయతీ పరిధిలో ఉన్న గిరిశిఖర గ్రామాల నుంచి రోగులు, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా పనులు జరగకపోవడంతో గిరిజనులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఒక దశలో కొదమ పంచాయతీ పరిధిలో ఉన్న కొన్ని గ్రామాల గిరిజనులు తమకు ఒడిశా గ్రామాలు అందుబాటులో ఉన్నాయని, ఒడిశాలో విలీనం చేయాలని ఆందోళన చేపట్టారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

చోడిపిల్లి మాలతీదొర, మాజీ వైస్ ఎంపిపి

కొదమ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరునెలలు దాటిపోయింది. ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడానికి కారణం ఏమిటో అర్థం కావడంలేదు. గిరిశిఖర గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గర్భిణీ స్త్రీల ను ఆసుపత్రి కి తీసుకెళ్ళాలంటే డోలీమోతల పైనే ఆధారపడాల్సి వస్తోంది.

అర్ధాంతరంగా నిలిచిపోయిన కొదమ రోడ్డు

స్కూల్ బస్సుల పర్మిట్లను రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్కూల్ బస్సుల పర్మిట్లను రెన్యువల్ చేసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో వివిధ స్కూళ్లకు సంబంధించి 82 బస్సులు ఉన్నాయన్నారు. వాటిలో 35 బస్సులు రవాణా శాఖ అనుమతులు పొందాల్సి ఉందని పేర్కొన్నారు. పార్వతీపురం ఎంవిఐ పరిధిలో 22, పాలకొండ పరిధిలో 5, సాలూరులో 8 బస్సులకు విద్యాసంస్థల యాజమాన్యం రోడ్ టాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికిల్ నిబంధనలను రూల్ 185 (జి) అనుసరించి బస్ సామర్థ్యం, పర్మిట్లను త్వరగా చేసుకోవాల్సిందిగా తెలిపారు. జిల్లాలో రవాణా శాఖ 5 ప్రత్యేక బృందాలను నియమించిందని, తనిఖీలో అనుమతుల్లేని బస్సులు పట్టుబడితే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. మోటర్ రవాణా చట్టం ప్రకారం అధిక మొత్తంలో అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆటో రిక్షాలు, స్కూల్, బస్సులు పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్లరాదని, రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా నడిపే ఆటో రిక్షా, స్కూల్ బస్సులపై జిల్లా రవాణాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆ ప్రకటన తెలిపారు. వాహన సామర్థ్యం సక్రమంగా లేని వాహనాల యజమానులు రోడ్ టాక్స్ ఈనెల 30 వరకు చెల్లించి నిలుపుదల (స్టాపేజ్), రద్దు (కేన్సిల్) చేయుటకు aprtacitizen.epragathi.org వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టిక ఆహారం సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఏర్పాటైన తర్వాత ఐసిడిఎస్ ప్రాజెక్టులు సంఖ్య పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కొమరాడ, గరుగుబిల్లి మండలాలు కలిపి ఒక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున ప్రభుత్వం సేవలను గ్రామ స్థాయికి వెళ్లేందుకు మరింత చర్యలు చేపడుతుందన్నారు. కావున అంగన్వాడీ కేంద్రాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సక్రమంగా పథకాలు అందేల కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు ఎం.సూరపునాయుడు, ఎంపిటిసి సభ్యులు అశ్విని, నాయకులు సింహాచలం, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యే ను కోరారు. ఐసిడిఎస్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన ఆమెను గ్రామస్తులు కలిసి సమస్యను వివరించారు. గ్రామానికి చెందిన జనార్దన్ గెడ్డలు, ప్రభుత్వ భూములు కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. గెడ్డలు కప్పేయడంతో దిగువనున్న 200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని తెలిపారు. తక్షణమే స్పందించి కబ్జాకు గురవుతున్న భూములను అడ్డుకొని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

భూ ఆక్రమణలపై ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిని అందజేస్తున్న గ్రామస్తులు

కెజిబివి ఎస్ఒ సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి - కలెక్టరేట్

వీరఘట్టం మండలం రేగులపాడు కస్తూరిబా గాంధీ విద్యాలయం ప్రత్యేకాధికారి సిహెచ్ రోహిణిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ జిల్లా పర్యటనలో భాగంగా డిఇఒ, ఎంఇఒ, జిడిడిఒ, కెజిబివి స్పెషల్ ఆఫీషర్ ను సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్లు అక్రమమని మన్యం జిల్లా యుఎస్‌పిఎస్ (ఉపాధ్యాయ సంఘం పోరాట సమితి) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరిగింది. ఈ పోరాటాలకి స్పందించిన ప్రభుత్వం, జిల్లా కలక్టరు యుఎస్‌పిఎస్ నాయకులుతో చర్చలు జరిపిన అనంతరం డిఇఒ, ఎంఇఒ, జిడిడిఒ సస్పెన్షన్లు ఎత్తి చేశారు. మంగళవారం కెజిబివి స్పెషలాఫీసర్ రోహిణి సస్పెన్సన్ ఎత్తి వేస్తూ ఉత్తర్వుల ప్రభుత్వం నుంచి జిల్లా కలక్టరుకి, డిఇఒకు అందాయి. ఈ సస్పెన్సన్లు ఎత్తివేయడంలో జిల్లా కలక్టరు చొరవకు జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యుఎస్‌పిఎస్) ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు యుటిఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్ రావు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రాన్స్‌కో ఎస్ఇ

ప్రజాశక్తి - కలెక్టరేట్

విజయనగరం ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ మువ్వల లక్ష్మణరావు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మంగళ వారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిశారు. జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు, వినియోగదారుల సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎపిఇపిడిసిఎల్ ఇఇ వివి కిషోర్, డిఇ కెవిరత్నం, ఐటిడిఎ సబ్ డివిజన్ డిఇ ఎం.రాజేంద్ర ప్రసాద్, పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎపిఇపిడిసిఎల్‌ఎస్ఇ

కళా వేదిక జిల్లా అధ్యక్షులుగా దేవానంద్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీశ్రీ కళావేదిక పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా పాలక దేవానంద్, గౌరవ అధ్యక్షులుగా రౌతు వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా తాడుతూరి వెంకట రమణారావు, గౌరవ సలహాదారుగా ఎన్.బాలకృష్ణ ఎన్నికయ్యారు. మహిళా అధ్యక్షులుగా రెడ్డి పద్మావతి, ప్రధాన కార్యదర్శిగా పెదప్రోలు శైలజ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎల్.హరిగోపాల్ ఎన్నికయ్యారు.

మాతృమరణాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన ప్రాంతంలో మాతృ మరణాలు నివారించేందుకు అన్ని ప్రాథమిక కేంద్రాలకు అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ వెంకటరమణ తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుకళ్లు, పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐటిడిఎ ఎమర్జెన్సీ అంబులెన్స్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఏజెన్సీలో మలేరియా నివారణకు మొదటి దశ స్ప్రేయింగ్ ఈ నెలాఖరు వరకు జరుగుతుందని, సబ్ ప్లాన్ మండలాల్లోని అన్ని స్కూళ్లు, కాలేజీలు, ఇండోర్ రెసి డ్యూ స్ప్రేయింగ్ జరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో గిరిజనుల కోసం రవాణా, బ్లడ్, పేషెంట్ల వైద్య సదుపాయాల అవగాహనకు గిరిజన సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఈ కేంద్రంలో 9 మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖలో ఎటువంటి ఇబ్బంది, సమస్యలు తలెత్తకుండా ప్రజల ఆరోగ్యమే ప్రధానంగా భావించి 24 గంటలు పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

ఆధార్ సేవలకు పోటెత్తిన గిరిజనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆధార్ అప్ డేట్ సేవలకు మంగళవారం చివరి రోజు కావడంతో గుమ్మలక్ష్మీపురంలో ఉన్న ఆధార్ కేంద్రానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున వచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆధార్ సేవల కోసం పిల్లాపాపలతో క్యూ లైన్‌లో నిలబడాల్సి వచ్చింది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడంతో ఆధార్ సేవలు గిరిజనులకు అంతంత మాత్రమే అందుతున్నాయి. మన్యం జిల్లా మార్పు, అడ్రస్ మార్పు కోసం ఎక్కువమంది ఆధార్ అప్డేట్ చేయించుకుంటున్నారు. మరోవైపు పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు జాయినింగ్‌కు ఆధార్ కార్డు తప్పనిసరి కావడంతో చేయించుకుంటున్నారు. జిల్లా అధికారులు ఈ సమస్యను స్పందించి సచివాలయాల్లో పెద్ద మొత్తంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆధార్ నమోదు కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న గిరిజనులు

తోటపల్లి దేవస్థానంలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి దేవస్థానంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తోటపల్లి దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సభ్యులు దేవాదాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌ను కోరారు. ట్రస్ట్ ప్రత్యేక సమావేశం మంగళవారం స్థానిక తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రామాలయానికి పూజారులు లేకపోవడం, ప్రసాదం తయారీకి వంట స్వామి లేకపోవడం, తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ ప్రతి రోజు వేద పండితులు ద్వారా వేద పారాయణం చేయడానికి తగు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రచార రథం, ఫండ్ రైజింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు నిర్ణయించారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, పండితులు పాల్గొన్నారు.

చిందరవందరగా ఉన్న తరగతి గది

మౌలిక వసతులు వెంటనే కల్పించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఒంప్లజోల ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో వార్డెన్ తప్ప మిగతా సిబ్బంది ఎవరూ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో గదులు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, విద్యార్థినులు తక్కువ మంది హాజరవ్వడం, స్టోర్ రూమ్ శుభ్రంగా లేకపోవడం, స్టోర్ రూమ్‌లో ఉన్న వంట సరుకులు పాడైపోయినడం చూసి అసహనం వ్యక్తం చేశారు. మౌలిక వసతులను వెంటనే కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

21కు చర్చలు వాయిదా

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని చింతపండు పిక్కలీత కార్మికులు, చింతపండు గోడౌన్ యజమానుల మధ్య మంగళవారం డిసిఎల్ సుబ్రహ్మణ్యం సమక్షంలో జరిగిన చర్చలు ఫలవంతం దిశగా జరిగాయి. కిలో చింతపండు పిక్కలీతకు కూలీ 21రూపాయలు ఇస్తామని యజమానులు చెప్పగా, 22రూపాయలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈనెల 21కు చర్చలను వాయిదా వేశారు. ఈ చర్చల్లో యజమానుల సంఘం తరపున వృద్ధవరపు గోపి, ఎ.తిరుపతి, కార్మిక సంఘం తరపున గౌరవాధ్యక్షులు ఎన్‌వై నాయుడు, శ్యామల, నారాయణమ్మ పాల్గొన్నారు.

పాఠశాలకు గేటు ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గడ్డి కాలనీ వీధిలో నిర్వహిస్తున్న ఎంపిపి పాఠశాలకు వెళ్లే ప్రధాన దారిలో గేటు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ వీధి మహిళలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల దారిలో జీడి పిక్కల వ్యాపార్లు నిలిపివేయడం, చెత్తాచెదారం పారవేయడంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. గేటు లేకపోవడంతో ఎవరికి నచ్చినట్లుగా వారు ఇక్కడ వాహనాలు నిలిపివేయడం పరిపాటిగా మారిందన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి గేటు ఏర్పాటుకు కృషి చేయాలని పాఠశాల హెచ్ఎంకు వినతి పత్రం అందజేశారు.

వర్షపు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్ రాష్ట్ర రహదారిపై నిల్వ ఉన్న వర్షం నీటిని తొలగించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న నీటి వద్ద నుంచి నిరసన చేపట్టారు. గుమడ గ్రామ సమీపంలో అంత రాష్ట్ర రహదారి పై గత కొద్ది రోజులుగా కురిసిన వర్షానికి రోడ్డు అంతా చెరువుగా మారడంతో రహదారిపై ఉన్న నీటిని వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో పెంటయ్య నాగయ్య మనోజ్ రాము వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపితోనే బడుగు వర్గాల అభివృద్ధి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

తెలుగుదేశం పార్టీతోనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. మంగళవారం అమరావతిలోని టిడిపి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మాదిగల ఆత్మీయ కలయిక సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాన్నాయన్నారు. అంతేకాక కులాలవారీగా విడదీసి వారి అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్లు నిధులు లేక నిర్వీర్యమైపోయాయన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగల అభివృద్ధికి ఏ ఒక్క చర్య చేపట్టలేదని తెలిపారు. విషయం గ్రహించిన రాష్ట్రంలోని మాదిగలంతా తెలుగుదేశానికి మద్దతు ప్రకటించి వారి విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బొబ్బిపేట, గెద్దలుప్పిలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ ఎంఎన్ఎస్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో పనులు చేసే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ఎస్‌డబ్ల్యుఎం యాప్‌లో చేసిన కార్యక్రమాలు అప్లోడ్ చేయాలని ఎంపిడిఒ కొండపల్లి సత్యం అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌డిసిసి షెడ్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనులు తప్పనిసరిగా చేయాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేయించాలని అన్నారు. నాడు నేడు పనులపై పరిశీలించాలని, గృహ నిర్మాణాలపై దృష్టి పెట్టాలని అన్నారు. సమావేశంలో కార్యదర్శులు సుదర్శనరావు, వినోద్ కుమార్, పాపారావు, కామేశ్వరరావు, అప్పలసూరి, అప్పలస్వామి పాల్గొన్నారు.

పాఠశాలల్లో మలాథియన్ స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో నాయుడు మల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, మల్లి ప్రభుత్వ కళాశాలలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో మలాథియన్ చేశారు. వసతి గృహాల్లో దోమలు నివారించడానికి స్ప్రేయింగ్ ఉపయోగపడుతుందన్నారు. అందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. రూముల్లో కూడా మరికొన్ని గుంతల్లో కూడా స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది యూన్సీ రామ్, ప్రధానోపాధ్యాయులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భామిని: స్థానిక పిహెచ్‌సి పరిధిలో గల వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రారంభమైన డెంగీ, మలేరియా నివారణకు ముందస్తుగా వసతి గృహాల్లో ఎసిఎం 5% స్ప్రే చేస్తున్నామని సీతంపేట డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పార్వతి తెలిపారు. మండలంలోని భామిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం నిర్వహిస్తున్న ఎసిఎం స్ప్రే ను ఆమె పరిశీలించారు. అన్ని వసతి గృహాల్లోనూ, ప్రతి గదిలో స్ప్రే చేయాలన్నారు. పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు వేడి నీరు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని వసతి గృహ, వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భామిని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఫణికుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి అప్పారావు, అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపల్ విజయ నిర్మల, హెచ్‌వి మరియా, ఎంఎస్ఎం సుశీల, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ ఉన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం ?

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్ర వద్ద గల కుడిప్రధాన కాలువ నీరును విడుదల చేసే ముందు కాలువను ఆనుకొని ఉన్న పార్వతీపురం నుండి పాలకొండ వెళ్లే రహదారి బ్రిడ్జి పిల్లరుకు సపోర్ట్ నిమిత్తం వేసిన సిమెంట్ గచ్చు పగిలింది. ఈ విషయం గుర్తించక సోమవారం కుడి కాలువ నుండి నీరు విడుదల చేశారు. దీంతో ఈ బ్రిడ్జి ఎప్పుడుఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లర్ వద్ద ఏర్పడిన బీటలు

బంగారు భవిష్యత్తుకు బాటలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల పరిధిలో గల 3650 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత చదువులు చదివించేందుకు కృషి చేయాలి, మీ అందరికీ ప్రభుత్వం తరఫున తప్పక సహాయ సహకారాలు అందుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, మండల ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని వండువ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే వి.కళావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం పెద్దపీటవేస్తుందని, కావున ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.సోంబాబు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు ,విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదబొండపల్లి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ జరిగింది. సూడిగం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎంపిపి మజ్జి శోభారాణి కానుకలు అందించగా, పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వి.గౌరీ కానుకలు పంపిణీ నిర్వహించారు.

విద్యార్థులకు కిట్లు అందజేస్తున్నఎమ్మెల్యే జోగారావు

గుమ్మలక్ష్మీపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును ఎంపిపి కె.దీనమయ్య పంపిణీ చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్య అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఏజెన్సీలో 10వ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీశంకర్రావు, ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : అటవీశాఖ

ప్రజాశక్తి -మక్కువ

మండలంలోని పులి సంచారం ఉండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ నారాయణరావు తెలిపారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లోని మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సోమవారం పులి దాడి లో రెండు ఆవులు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రజల నుంచి అందిన పాదముద్రల వివరాలు పులివి కాదన్న ఫారెస్ట్ అధికారులు మంగళవారం పులిజాడను, పాదముద్రలను కనుగొన్నామని ఆయన 'ప్రజాశక్తి'కి తెలిపారు. సోమవారం జరిగిన పులి దాడి చేసిన ప్రాంతం తమ పరిధిలో లేనప్పటికీ ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నామనితెలిపారు ప్రజలు అప్రమత్తంగా ఉండడం ఎంత ముఖ్యమో, వన్యప్రాణాలను సంహరించడం కూడా అంతే నేరమని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు. రాత్రి వేళలో ఒంటరిగా బయట తిరదొద్దని ప్రజలకు ఆయన సూచించారు

ఎంఆర్ నగర్‌లో వ్యవసాయ బోరు వద్ద నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

తాగునీటికి కటకట

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని సుమారు 106 గ్రామాలకు డోకిశీల -డిశిర్లాం పైలెట్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు సరఫరా అవుతుంది. అయితే ఇటీవల ఎమ్మార్ నగరంలో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్న సందర్భంగా పైప్ లైన్ ఏర్పాటుకు తవ్విన గుంతల్లో పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన పైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఎమ్మార్ నగరం, చిన్నబొండపల్లి, వెంకంపేట, వైకెఎంనగర్, కృష్ణపల్లి, చౌక్కాపుమానివలస, వెల్లానుపురం గ్రామాలకు తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ప్రజలు తాగునీటి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. వాడుక నీరు చెరువుల్లో నుంచి తీసుకురావడంతో పాటు తాగేందుకు సమీప బావుల్లో నుంచి నీళ్లు తోడుకుంటున్నారు. వెంకంపేట సర్పంచి గ్రామస్తుల పరిస్థితి గ్రహించి వాటర్ ట్యాంకులతో కొన్ని కాలనీలకు నీళ్లు సరఫరా చేసినప్పటికీ సమస్య తీవ్రతంగా ఉంది. తక్షణమే గ్రామీణ నీటి సరఫరా అధికారులు చర్య తీసుకుని వెంటనే పైపులైన్లకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ట్రోఫీని అందుకుంటున్న కొండవీధి జట్టు సభ్యులు

హోరా హోరీగా క్రికెట్ ఫైనల్ మ్యాచ్

విజేతగా కొండవీధి జట్టు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామంలో గత నెల రోజులుగా జరుగుతున్న కొండవీధి క్రికెట్ టోర్నీ లో మంగళవారం ఫైనల్ మ్యాచ్ కొండవాడ, కొండవీధి జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ఈ మ్యాచ్‌లో కొండవీధి జట్టు 50 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. విజేతలకు ఎంపిపి కుంబురిక దీనమయ్య చేతులు మీదుగా బహుమతి ప్రధానం చేశారు. విజేతగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతి రూ.22,222, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.11,111అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో క్రికెట్ క్రీడ పట్ల యువత ఆసక్తి చూపడం అభినందనీమన్నారు. ప్రతి ఒక్కరు క్రీడాస్ఫూర్తితో మెలిగి స్నేహ భావం పెంపొందించుకోవాలని కోరారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి 70 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్ రావు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జిగిరిబాబు, కొండవీటి యువత, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

వీరఘట్టం : మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు గ్లాసులు పంపిణీ చేశారు. మంగళవారం, గురువారం, శనివారాల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్నందున ప్రభుత్వం వాటిని దృష్టిలో పెట్టుకుని గ్లాసులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అతిసార సోకకుండా జాగ్రత్తలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అతిసార సోకకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాలు (ఐడిసిఎఫ్)లో భాగంగా చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. వైద్య సిబ్బంది, పిల్లలు, వారి తల్లులతో ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా(అతిసారం) లక్షణాలు గుర్తిస్తే వెంటనే వారికి ఒఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు నిర్దేశించిన మోతాదులో ఇవ్వాలన్నారు. ప్రతి విరేచనం తర్వాత ఒఆర్ఎస్ ద్రావణం, 14 రోజుల వరకు జింక్ మాత్రలు పాలలో లేదా నీటిలో కలిపి ఇవ్వాలని సూచించారు. డయేరియా వల్ల పిల్లల్లో నీటి శాతం కోల్పోవడం వల్ల డీ హైడ్రేషన్‌కు గురవుతారని వెంటనే ఒఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇచ్చి చికిత్స అందజేయాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో, అంగన్వాడీ కేంద్రాల్లో ఒఆర్ఎస్, జింక్ కార్నర్ లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ పిల్లలకు ఒఆర్ఎస్ అందజేసిన వివరాలు, డయేరియా లక్షణాలను గుర్తించిన పిల్లల వివరాలు నివేదికగా ప్రతి రోజు వైద్య సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయానికి సమర్పించాలన్నారు. ఈనెల 17 వరకు ఈ కార్యక్రమము కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ కుమార్, సూపర్ వైజర్లు పుష్ప, జయగౌడ్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

'మా తోట'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మా తోట, జీవ పైలెట్ ప్రాజెక్టును గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ అసిస్టెంట్ మేనేజర్ కె.గణేష్ కుమార్, నాబార్డ్ కన్సల్టెంట్ సత్య ఒగ్గు కోరారు. మండలంలోని గొరడలో మా తోట జీవ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులు, రైతులతో సమావేశంలో నిర్వహించారు. రైతులతో మాట్లాడుతూ 12ఏళ్ల క్రితం నాబార్డ్ ఆర్థిక సహకారంతో జట్టు పర్యవేక్షణలో 500 గిరిజన కుటుంబాలకు 500 ఎకరాల్లో మాతోట కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఇప్పుడు వాటి ఫల సాయం అనుభవించడం జరుగుతుందన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధుల మెరుగుకు ఈ జీవ పైలెట్ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గొరడలోని 8 మంది రైతులు, ఆర్.జమ్మూలోని 9 మంది రైతులు, పెంగవలో 9 మంది రైతులు, వల్లాడలో 14 మంది రైతులతో పైలెట్ ప్రాజెక్టు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వీరికి ప్రకృతి వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు, నీటిని నిల్వ చేసుకునే కార్యక్రమాలు, పశు మూత్ర సేకరణ శాలలు, చిరుధాన్యాలు సాగు విస్తీర్ణం పెంపు, దేశి వరి సాగు విస్తీర్ణం పెంపు, చేపల పెంపకం, చెరువు గట్లపై మొక్కలు పెంపకం, దేశీ నాటు కోళ్ల పెంపకం మొదలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఇతర రైతులకు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ చెరువు ద్వారా ఎన్ని ఎకరాల పంటలకు నీరు అందుతుంది, ఏ నెల వరకు నీరు నిల్వ ఉంటుంది, చేపల పెంపకానికి అనుకూలంగా ఉందా లేదా పరిశీలించారు. టి.రాము పసుమూత్ర సేకరణ శాల, ఆర్.జమ్మూలోని పి.లక్ష్మీ మా తోటల్లోని పంటలను పరిశీలించారు. జట్టు స్వచ్ఛంద సంస్థకు ఈ జీవ పైలెట్ ప్రాజెక్టు చేయడానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య, కార్యదర్శి కిల్లక చిరంజీవి, సభ్యులు తోయక గీత, పాడి లక్ష్మి, కిల్లక జ్యోతి, డైరెక్టర్ ఎస్ ప్రహరాజ్, టి గవరయ్య రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

మాతోటను పరిశీలిస్తున్న నాబార్డు, జీవ ప్రాజెక్టు కమిటీసభ్యులు

సాయినగర్ కాలనీలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒ.శాంతకుమారి, ఎఎన్ఎం ఉష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ములగలో 40 మందికి వైద్య పరీక్షలు

పార్వతీపురం రూరల్ : మండలం ములగలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డోకిశిల పిహెచ్సి. వైద్యాధికారిని ఐశ్వర్య తెలిపారు. ఈ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సమాచారం ముందు రోజే తెలియజేయడంతో ఎక్కువ మందికి వైద్య సేవలు అందించామన్నారు. గ్రామంలో గర్భిణులు, వృద్ధులు, చిన్నారుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడక కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

రైతుల ప్రభుత్వం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తుందని బాలగుడబ గ్రామ సర్పంచ్ పోలమ్మ పండు అన్నారు. మంగళవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సాగుకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. రైతులందరికీ రాయితీపై విత్తనాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాలను రైతులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భామిని : స్థానిక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయధికారి కె.సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన ధాన్యం విత్తనాలు పంపిణీలో భాగంగా ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం రైతులకు విత్తనాలును అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలోని 16 ఆర్‌బికెల్లో ఎంటియు 1061రకం 706.7క్వింటాలు, ఆర్‌జిఎల్ 2537 రకం 212.7క్వింటాలు, ఎంటియు 1064రకం 36.1 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని, రైతులు తమకు ఖరీఫ్‌కు అవసరమైన ధాన్యం విత్తనాలను ఆర్‌బికెల్లో కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమం విఎఎలు ఎర్రన్న, జ్యోతి, రైతులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

దళారుల ప్రవేయం లేకుండా ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మండలం దశమంతపురంలో మంగళవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి వారికి సంక్షేమం పథకాలు అందిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, ఎపిఒ జి.సత్యం నాయుడు, సచివాలయ కార్యదర్శి కె సునీల్ కుమార్, విఆర్ఒ జి.రాజేంద్రప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు ,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

కొమరాడ : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ సక్రమంగా అందాలని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని కుమ్మరిగుంటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఉండడంతో అధికారులు పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపిపి నాగిరెడ్డి శరత్, మండల స్థాయి అధికారులు ఎఒ రమేష్, తహశీల్దార్ రాధాకృష్ణ, ఎపిఎం, మండల వ్యవసాయ శాఖ అధికారి శంకరరావు, ఎంఇఒ నారాయణస్వామి, వైసిపి కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్ నాయుడు, నాయకులు శెట్టి మధుసూదనరావు, మరడాన సింహాచలం నాయుడు, సూరపునాయుడు, మల్లి బాబు తదితర వైసిపి నాయకులు ఉన్నారు.

వారాహి యాత్ర విజయవంతానికి పూజలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఈనెల 14 నుంచి చేపడుతున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని, పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ జనసేన నాయకులు మంగళవారం పట్టణంలోని దుర్గ గుడి ప్రాంగణంలో గల సర్వమంగళ దేవి ఆలయంలోనూ, కొత్తవలసలో గల ప్రసన్నాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర బాగు కోసం తమ జనసేనాని పవన్ కల్యాణ్ అన్ని త్యాగం చేసి ప్రజల కోసం పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు పనిచేస్తున్నాయన్నారు. ఆ దుష్టశక్తుల పన్నాగం పతనం కావాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చందక అనిల్, వి.దాలినాయుడు, రాజాన రాంబాబు, సురేష్ నెయ్యిగాపుల, సిరిపురపు గౌరీ, సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు, మానేపల్లి ప్రవీణ్, ఖాతా విశ్వేశ్వరరావు, సిరిపురపు చైతన్య, కొల్లేపర తేజ, కునుకు రమేష్, బూరగాన సాయి, తాడ్డి వినయ్, కడగల లింగ తదితరులు పాల్గొన్నారు..

వృద్ధుడికి వైద్య సాయం

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మండు వేసవిని తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయిన గుర్తుతెలియని వృద్ధుడికి గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. సోమవారం రోజంతా ఎండలో ఉన్న ఆయన వేడి మీకు తట్టుకోలేక స్పృహ కోల్పోయాడు. దీంతో స్పందించిన సర్పంచ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఫోటోలో ఉన్న వ్యక్తిని గుర్తిస్తే 8985 17 5378 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - కొమరాడ

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్థానిక జూనియర్ కళాశాల జంక్షన్ వద్ద లభ్యమైనట్లు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక జూనియర్ కాలేజీ జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 70 నుంచి 75 వయస్సు గల గుర్తుతెలియని వృద్ధుడు మృత దేహం ఉన్నదనే సమాచారం వచ్చిందని తెలిపారు. ఈ మేరకు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తి గత వారం రోజులుగా చుట్టు పక్కల గ్రామాల్లో తిరుగుతూ ఉండేవాడని సమాచారం. మృతునివివరాలు తెలిస్తే తమకు తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని టేకులోవలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటరమణ తన భార్య అనితతో తరచూ ఘర్షణ పడుతుండేవాడు. సోమవారం ఇరువురి మధ్య మరోసారి గొడవ జరగడంతో మనస్థాపం చెందిన ఆమె గడ్డి మందు తాగింది. స్పందించిన కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

భార్య కాపురానికి రాలేదని....

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సీతానగరం మండలం బక్కుపేటకు చెందిన మర్రాపు రవీంద్రకుమార్ తన భార్య కాపురానికి రావడానికి నిరాకరించిందన్న కారణంగా మంగళవారం తన ఇంట్లో ఉన్న పర్సెంటైల్ తాగి ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు స్పందించి జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎఎన్ఎంకు గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని గంగాపురం సచివాలయంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ముడిదాన సరోజిని మంగళవారం తన ద్విచక్ర వాహనంపై జిల్లా ఆసుపత్రికి వెళ్తుండగా, వెంకంపేట చెరువు మలుపులో వెనుక నుంచి వస్తున్న బొలోరో వాహనం ఢీకొనడంతో తలకు గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు